


ఆ సెంటర్లో ఏ గొడవ జరిగినా, అందులో తల దూర్చడమన్నా, అటు వాళ్లతోనూ ఇటు వాళ్లతోనూ గోడ మీది పిల్లిలా మాట్లాడడమన్నా 'లంబోదరానికి' మా చెడ్డ సరదా!

ఆ సరదా ఈ నాటిది కాదు... చిన్నప్పుడు వీధి గొడవల్లోనూ, ఆ తర్వాత చదువుకునే రోజుల్లో స్కూల్, కాలేజ్ గొడవల్లోనూ, ప్రస్తుతం ఆఫీస్ గొడవల్లోనూ తన పాత్రంటూ లేని గొడవుండదు.

లంబోదరం ఎన్నోసార్లు ఈ అలవాటు మానుకొందామని ప్రయత్నించినా, ఎందుకో తన ముందు ఏదైనా గొడవ జరుగుతుంటే ఇక ఆగలేక అందులోకి తల దూర్చేస్తాడు.

ఆ రోజు అదే జరిగింది—

ఆదివారం కావడంతో సెంటర్లో షాప్‌లన్నీ మూసేసి వున్నాయి. లంబోదరం ఏ వ్యాపకం లేకుండా అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఇంతలో ఎక్కడ్నుంచో బిలబిల మంటూ ఏదో గొడవ వినిపించింది.

లంబోదరం ఠంచన్‌గా ఆత్రంగా వెనక్కి తిరిగి చూశాడు. తనకు అల్లంత దూరంలో ఎవరో ఇద్దరు కుర్రాళ్లు క్రిందా మీదా పడి కొట్టుకుంటున్నారు. అప్పటికే వాళ్ల చుట్టూ చేరిన జనం ఆ తతంగాన్నీ చూస్తున్నారే తప్ప ఎవరూ విడిపించే ప్రయత్నం చేయడం లేదు.

లంబోదరం ఇదంతా చూస్తూ ఇక ఆగలేక మెరుపు కన్నావేగంగా ఇద్దరి మధ్యకు దూసుకెళ్లి చెరో వైపు త్రోసేసాడు.

లంబోదరం పర్సనాలిటీకి ఇద్దరూ కాస్త వల్లబడ్డారు. బట్టలు దులుపుకుంటూ లేచి నిలబడ్డారు.

చుట్టూ నిలబడ్డవారిని తరిమేస్తూ,

"ఏం జరిగింది? ఎందుకలా క్రిందా మీదా పడి తన్నుకుంటున్నారు?" ఇద్దరి వంక చూస్తూ అడిగాడు లంబోదరం.

"చూడండి సార్ ఈ స్కౌండ్రల్..." పళ్లు నూరుతూ చెప్పబోయాడు మొదటి యువకుడు.

"ఆ... ఆ... తిట్ల కార్యక్రమం తర్వాత, ముందు విషయం చెప్పండి" కాస్త కోపంగానే అడిగాడు లంబోదరం.

మళ్లీ ఆ యువకుడే చెప్పడం మొదలెట్టాడు.

"పీడు రోజూ మా చెల్లెలి వెంటబడి రోడ్డంతా అడ్డమైనా అవాకులు చెవాకులు పేలుతుంటాడు. అది చాలదన్నట్టు మొన్న అంగాంగ వర్ణన చేస్తూ అసహ్యంగా ఓ ప్రేమలేఖ వ్రాశాడు. పైగా ఆమెను నేను ప్రేమిస్తున్నానంటూ నానా రభస చేస్తున్నాడు. చిన్నటి నుంచి వెతగ్గా వెతగ్గా ఇదుగో ఇక్కడ దొరికాడు. చెప్పండి... ఇలాంటి వాళ్లని నాలుగు తగిలించడంలో తప్పేంటి?" ఆవేశంగా అన్నాడు.

"మంచిపని చేశారు. ఈ రోజుల్లో ప్రతి వెధవకి ఆడపిల్లల్ని టీజ్ చేయడం ఓ పెద్ద ఫ్యాషనైపోయింది... మీరు వెళ్లండి ఇతని విషయం నేను చూసుకుంటాను" రెండో యువకుని కోపంగా చూస్తూ అన్నాడు లంబోదరం.

"అది కాదు సార్ అసలు వీడ్ని పోలీసులకి..."

"అబ్బే! మీరు వెళ్లండి నేను చూస్కుంటాగా!" అతని భుజంపై చెయ్యేస్తూ అన్నాడు లంబోదరం.

అతడు ఇబ్బందిగానే ముందుకు కదిలాడు.

అతడలా వెళ్లగానే రెండో వ్యక్తి వైపు తిరిగాడు లంబోదరం. అప్పటికే ఆ యువకుడు లంబోదరం తనవేం చేస్తాడోనని వణికిపోతున్నాడు.

లంబోదరం మాత్రం అతడూహించినట్టు చేయ కుండా అతని భుజంపై చెయ్యేస్తూ చిన్నగా నవ్వాడు.



ఆ నవ్వు చూసి అతడికి కాస్త ప్రాణం లేచి వచ్చింది. లంబోదరం ఆప్యాయంగా నిమురుతూ అన్నాడు.

"చూడు... నీకు ఇలాంటి విషయాల్లో బొత్తిగా అనుభవం లేనట్టుంది. అసలు అమ్మాయిల్ని ఏడ్పించడం నన్నడిగితే పెద్ద తప్పేమీ కాదు. ఇట్స్ థ్రిల్! అండ్ ఇట్స్ ఆర్ట్! బట్, గొడవ ఇంతదూరం తెచ్చుకోవద్దు. ఇకముందైనా జాగ్రత్తగా మసలుకో.... గోహెడ్" అన్నాడు లంబోదరం అదోలా కన్నుగీటుతూ

ఆ కుర్రాడు సంతోషంతో.

"థాంక్స్ సార్! సమయానికి దేవుడిలా వచ్చి రక్షించారు. మీ మేలు ఎప్పటికీ మరచిపోలేను." లంబోదరం చేతుల్ని ఆప్యాయంగా పట్టుకుని చెప్పి వెళ్లిపోయాడు.

లంబోదరం సన్నగా నవ్వుకున్నాడు.

* * *

రామకృష్ణా బీచ్.

చల్లటి సాయంకాలం.

పద్మినీ ఒళ్లో తలపెట్టుకుని పడుకున్నాడు లంబోదరం. లంబోదరానికి అలా పడుకుంటే ఎంతో హాయిగా వుంటుంది. పద్మిని సున్నితంగా తన తల వెంట్రుకల్ని వెనక్కి తోస్తూ కబ్లురు చెబుతుంటే అలా రోజుల తరబడి వినాలని పిస్తుంది.

కానీ, ఈ రోజెందుకో పద్మిని మాత్రం అవుటాఫ్ మూడ్‌లో ఎటో చూస్తూ ఏదో తీవ్రంగా ఆలోచిస్తుంది.

లంబోదరానికి చిరాకేసి లేచి కూర్చొని అడిగాడు.

"వాట్ హేపెండ్ పద్మినీ? ఎందుకలా ముభావంగా వున్నావు?"

"అబ్బే! ఏం లేదు."

"నాతో చెప్పకూడదనిదా?"

"అదేం లేదు?"

"మరి?"

పద్మిని క్షణం సేపు ఆగి చెప్పసాగింది.

"ఈ విషయం నీ దాకారానీవద్దను కున్నాను. కానీ చెప్పక తప్పడం లేదు. ఎవడో ఒక రాస్కెల్ రోజూ నా వెంటబడి గొడవ చేస్తున్నాడు. మొన్న నాకో ప్రేమలేఖ కూడా వ్రాశాడు. ఈ విషయం అన్నయ్యతో చెబితే వాణ్ణి సెంటర్లో దొరికించుకొని నాలుగు వాయించబోయాట్ట! ఇంతలో ఎవడో కోన్ కిస్కాగాడు మధ్యలో పానకంలో పుడకలా దాపురించి ఇద్దర్ని విడిపించాట్ట..." పద్మిని ఇంకా ఏదో తిడ్తూనే వుంది.

లంబోదరం మాత్రం నినలేక చెవులు మూస్కున్నాడు

— విశ్వనాథం సురేశ్